క్లుప్తంగా

వేలంపాటను పరిశీలించిన జేసీ



వివరాలు తెలుకుంటున్న జేసీ విష్ణుచరణ్

బొమ్మలసత్రం: పట్టణంలోని ఏపీఎస్బీడీసీ ఎల్, ఐఎంఎఫ్ఎల్ డిపోల్లోని వస్తువుల వేలం పాటను జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో డిపోలోని ఫ్రీజర్, ఇన్వర్టర్ తదితర వస్తువుల వేలంపాట కార్యక్రమాన్ని జేసీ ఆకస్మికంగా తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేలంపాటకు హాజరైన ఔత్సాహికుల ఎదురుగా పారదర్శకంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎక్సైజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జొన్నలో సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఏఓ స్వప్నికారెడ్డి

గోస్పాడు: జొన్న సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి అన్నారు. మండలంలోని పసురపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో సమావేశం నిర్వహించి సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జొన్న సాగులో అనుసరించాల్సిన పద్ధతులు, పైరుకు సోకే తెగుళ్లు, నివారణ పద్ధతులను వివరించారు. డిసెంబర్ 15వ తేదీలోపు రబీ క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు. డీఆర్సీ ఏఓ పద్మావతమ్మ, వీఏఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులు ఉన్నతంగా ఎదగాలి



నాయీ బ్రాహ్మణ పెద్దలతో మంత్రి ఫరూక్

నంద్యాల(వ్యవసాయం): నాయీ బ్రాహ్మణులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం స్థానిక ఎస్బీఐ కాలనీలో త్యాగరాజ స్వామి ఆలయంలో ధన్వంతరీ నాయీ బ్రాహ్మణ కార్తీక వనభోజన మహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. వారి దేవస్థానానికి రోడ్డు ఏర్పాటు చేస్తానని, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు మొమెంటోలు అందజేశారు. న్యాయవాది రామచంద్రరావు, ఫిరోజ్, నాగలక్ష్మమ్మ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్పీఎస్ హక్కుల పోరాట దినోత్సవం

నంద్యాల(అర్బన్): పట్టణంలో వికలాంగుల హక్కుల పోరాట దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ విక్టోరియా రీడింగ్ రూం సమీపంలోని సమితి కార్యాలయంలో మంగళవారం జిల్లా అధ్యక్షుడు గంగాధర్శెట్టి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించి మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గంగాధర్ శెట్టి మాట్లాడుతూ.. వికలాంగుల సంక్షేమం కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేసిన కృషి ఎనలేనిదన్నారు. నాయకులు మాధవి, నరసింహులు, బెనర్జీ, తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ క్రీడలు ప్రారంభం



క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్లో ఉన్న డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో మంగళవారం 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-19 ఫెన్సింగ్ బాలబాలికల క్రీడలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. క్రీడలను రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, కర్నూలు జిల్లా స్కూల్ గేమ్ కార్యదర్శి హర్షవర్ధన్, నంద్యాల జిల్లా కార్యదర్శి శ్రీనాథ్, రాష్ట్ర అండర్-19 ఫెన్సింగ్ పరిశీలకులు భవానీ ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫెన్సింగ్ పోటీలకు 300 మంది క్రీడాకారులు, 50 మంది క్రీడాధికారులు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఎడ్యుకేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏపీరెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దండెనాగరాజు, విశ్వనాథ్, కోచ్లు లక్ష్మణ్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.









అంబేద్కర్ విగ్రహం వద్ద ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకుల నివాళి, అంబేద్కర్, గాంధీ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు, మాక్ పార్లమెంట్లో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థికి సర్టిఫికెట్, మెమెంటో అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

మహోన్నతమైనది భారత రాజ్యాంగం

నంద్యాల(వ్యవసాయం)/(అర్బన్): భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావినూతల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26న రూపొందించబడిందన్నారు. సీనియర్ న్యాయవాదులు శ్రీనివాస్ రెడ్డి, ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

- ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు ఆకుమల్ల రహీం, మునిస్వామి, మన్నెం జానయ్య, తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగంపై ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.
- ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కోటేష్ మాదిగ, నాయకులు రాధమ్మ, కమలమ్మ మాదిగల ఆధ్వర్యంలో పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- క్రాంతినగర్ వద్ద ఉన్న విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో టెక్నికల్ ఈఈ నాగేశ్వరరావు, డీఈఈ పెద్దయ్య, సుబ్రమణ్యం ఏఈ రవికుమార్ తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నందమూరినగర్లో ఉన్న స్టార్ సొసైటీ బాల కార్మిక పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల మాజీ సభ్యురాలు రాజేశ్వరమ్మ మాట్లాడుతూ భారత రాజ్యాంగం 395 ఆర్టికల్స్, 8 షెడ్యూల్స్, 22 భాగాల్లో ఏర్పాటైందని, ప్రపంచంలోనే అతిపెద్ద లిఖితపూర్వక రాజ్యాంగమన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని రూపొందించిన నిర్మాతలను స్మరించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. సొసైటీ కార్యదర్శి సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- బొమ్మలసత్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి విద్యార్థి, యువజన, దళిత సంఘాల నేతలు, జేఏసీ చైర్మన్ రాజునాయుడు, అధ్యక్షుడు సుంకన్న, జిల్లా గిరిజన విద్యార్థి సమాఖ్య రవీంద్రనాయక్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- గోస్పాడు మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీ నాగఅనసూయ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధికారులు రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఏపీఓ నాగజ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.
- స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ శైలజ రాణి అధ్యక్షతన విద్యార్థులతో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయానంద్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.
- ఖాదరబాద్ నర్సింగరావు పురపాలక ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులచే మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శివకుమార్ పాల్గొని రాజ్యాంగం ఆవశ్యకతను, ఏర్పాటు చేసిన విధానాన్ని వివరించారు.
- పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం, జన్ జాతీయ గౌరవ వర్స్, ఎన్సీసీ దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ హక్కులను తెలుసుకొని భవిష్యత్తులో ప్రయోజకులు కావాలన్నారు.విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ కేజీబీవీ సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.



చాగలమర్రిలో విద్యార్థులతో 75వ రాజ్యాంగ దినోత్సవ ఆకృతి



శిరివెళ్ల: ర్యాలీ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



దొర్నిపాడు: విద్యార్థులచే నిర్వహిస్తున్న మాక్పోలింగ్ను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ



ఆళ్లగడ్డ: వైఎస్సార్సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఆళ్లగడ్డ: మాట్లాడుతున్న జిల్లా జడ్జి మరళీకృష్ణ, రిటైర్డ్ జడ్జి శివప్రసాద్

- ఆకట్టుకున్న చారిత్రక కట్టడాల నమూనాల ప్రదర్శన
- విద్యార్థులచే 75వ రాజ్యాంగ ఆకృతి ఏర్పాటు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



ముత్యాలపాడు ఎస్పీజీ ఉన్నత పాఠశాలలో దేశ చారిత్రక కట్టడాల చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు,



సర్వాయిపల్లెలో ఉపాధి కూలీలతో కలిసి ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏపీడీ

చాగలమర్రి: ప్రపంచంలోనే భారత రాజ్యాంగం మహోన్నతమైనదని చాగలమర్రి ఎంఈఓ సయ్యద్ న్యామతుల్లా అన్నారు. మంగళవారం స్థానిక ఎలిమెంటరీ మెయిన్ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారత రాజ్యాంగ పరిషత్ 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించిందని చెప్పారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కోటయ్య ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్.అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ ఎం.ఎస్ అన్సర్బాషా స్వాతంత్ర్య సమరయోధులు డా.ఆర్.రాజేంద్రప్రసాద్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, జవహర్లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం గౌసులాజం ఆధ్వర్యంలో విద్యార్థులతో 75వ రాజ్యాంగ దినోత్సవం ఆకృతిలో ప్రదర్శన చేపట్టారు. ముత్యాలపాడు ఎస్పీజీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు దేశంలోని చారిత్రక కట్టడాలైన రెడ్ ఫోర్ట్, కుతుబ్మినార్, తాజ్మహల్, ఇండియాగేట్, చంద్రయాన్-3, ప్రాజెక్టు, అడవులు, నదులు, రాట్నం నమూనాలను తయారు చేసి పాఠశాలలో ప్రదర్శించారు.విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో, అమృత్ సరోవర్ వద్ద ఉపాధి కూలీలు సైతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్.జంబులదిన్నె ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ వీరప్రతాప్రెడ్డి, ఉయ్యాలవాడ మోడల్స్కూల్లో అధ్యాపక బృందం, సర్వాయిపల్లెలో గ్రామస్థులు, ఉపాధి కూలీలతో కలిసి ఏపీడీ సాంబశివరావు, ఎంపీడీ ఓఉమామహేశ్వరరావు, ఏపీఓ రవిప్రకాష్ తదితరులు అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి రాజ్యాంగానికి లోబడి తమ శాఖల్లో అంకితభావంతో పని చేస్తూ దేశాభివృద్ధికి తోడ్పడతామని ప్రతిజ్ఞ చేశారు.

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఇంద్రావతి ఆధ్వర్యంలో రాజ్యంగ విశిష్టతపై సభ జరిగింది. అంతకు ముందు ఎస్.సీ.సీ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ చేశారు. విద్యార్థులచే రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు.

రుద్రవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బాలస్వామి, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి తదితరులు కలిసి స్వాతంత్ర్య సమయోధుడు మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దొర్నిపాడు: మండలంలోని అన్ని సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి అఖిలాబేగం, ఎంపీడీఓ సావిత్రి, ఎంఈఓ మనోహర్రెడ్డి, ఈఓపీఆర్డీ సులోచన, హెచ్ఎం శ్రీనివాసరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ గంగన్న, ఏఓ నారాయణమూర్తి తదితరులు రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు.

ఆళ్లగడ్డ: స్థానిక వైఎస్సార్సీపీ కార్యాలయంలో నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో భారత రాజ్యాంగానికి విశిష్ట గుర్తింపు ఉందని కొనియాడారు. అనంతరం రాజ్యాంగం అమలుపై ప్రతిజ్ఞ చేశారు. నాయకులు సుధాకర్రెడ్డి, నరసింహారెడ్డి, గంగుల రామిరెడ్డి, చంద్రశేఖర్రెడ్డి, చక్రపాణి, రమేష్గౌడ్, చెన్నయ్య, కిషోర్ ఉన్నారు.

- స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శివరామయ్య, ఎస్ఐ నగీన విద్యార్థులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు.
- ప్రజ్ఞా కళాశాలలో ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్బాషు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆళ్లగడ్డ అయిదవ అదనపు జిల్లా జడ్జి మళీకృష్ణ, రిటైర్డ్ జడ్జి శివప్రసాద్ హాజరై రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

విద్యార్థులచే మాక్పోలింగ్

దొర్నిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే ఎన్నికల విధానంపై మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటు హక్కును వినియోగించుకునే విధానాన్ని వివరించారు. ఎంఈఓ మనోహర్రెడ్డి, హెచ్ఎం శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు, కార్మిక వ్యతిరేక శక్తులను తరిమికొట్టండి

నంద్యాల(న్యూటౌన్): కార్పొరేట్ సంపదను ప్రజలకు పునఃపంపిణీ చేసి, అవినీతి కుబేరుడు అదానీని అరెస్ట్ చేయాలని, రైతు కార్మిక వ్యతిరేక శక్తులను తరిమికొట్టాలని ఏఐటీయూసీ, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, సోమన్న, ఐఎఫ్టీయూ సెక్రటరీ శంకర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏసురత్నం, నాగరాజు, బాలవెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కార్మిక సంఘాలు, రైతు సంఘాల పిలుపు మేరకు పెద్ద ఎత్తున ర్యాలీతో పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రామిక వర్గం కష్టపడి కూడబెట్టిన దేశ ఆర్థిక సంపదను కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్ మిత్రులైన అదానీ, అంబానీలకు తాకట్టు పెడుతోందని విమర్శించారు. కార్పొరేట్లకు పన్నురాయితీ ప్రోత్సాహం పేరుతో రూ.19 లక్షల కోట్ల రుణమాఫీ చేసి ప్రజాధనాన్ని దోచిపెట్టిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్, భారీ పరిశ్రమలు, గనుల సముద్ర తీరాన్ని కారు చవకగా కార్పొరేట్లకు కట్టబెడుతోందన్నారు. కార్మికుడికి కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అసంఘిత రంగంలో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు మోదీని గద్దె దింపేందుకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల నాయకులు శ్రీనివాసులు, శివయ్య, కులాయి స్వామి, జులేఖతో పాటు సీఐటీయూ, రైతు సంఘం , ఏఐటీయూసీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.



నంద్యాలలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సైబర్ నేరాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న సంజయ్కుమార్

నంద్యాల(అర్బన్): సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ ఎస్పీ యుగంధర్ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్లో మంగళవారం సాయంత్రం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్బీఐ అమరావతి సర్కిల్ జనరల్ మేనేజర్ సంజయ్కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏఎస్పీ యుగంధర్ మాట్లాడుతూ మొబైళ్లకు వచ్చే ఓటీపీ, సీవీవీ ఇతరులకు తెలియకుండా జాగ్రత్త వహించాలన్నారు. జనరల్ మేనేజర్ సంజయ్కుమార్ మాట్లాడుతూ.. చదువుకున్న వారే డిజిటల్ మోసాలకు గురవుతున్నారని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్బీఐ చీఫ్ మేనేజర్ రాజశేఖర్, ఆర్ఎం సూర్యప్రకాష్, మనోహర్, కేశవ, సీఐ సూర్యమౌళి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

నంద్యాల(అర్బన్): గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని డ్వామా పీడీ జనార్దన్రావు హెచ్చరించారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.85.85 కోట్ల నిధులతో జిల్లాలో 1026 పనులు జరుగుతున్నాయన్నారు. మండలంలోని బిల్లలాపురం గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1026 సీసీ, బీటీ రోడ్డు పనులు జరుగుతున్నాయని, 866 పనులు పూర్తి కాగా 155 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. పది రోజుల్లో పనులన్నీ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ఏపీఓ శ్రీకళారెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న పీడీ జనార్దన్రావు

ఎస్ఎంసీలకు గౌరవ వేతనం ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలకు గౌరవ వేతనం ఇవ్వాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, అశోక్రెడ్డి కోరారు. వారు మంగళవారం మాట్లాడుతూ పేరెంట్స్ కమిటీని స్కూల్ మేనేజ్మెంట్ కమిటీగా మార్పు చేస్తూ ఉత్తర్వులు 37 వెలువడటం వల్ల పాఠశాలపై కమిటీకి బాధ్యత పెంచినట్లు అయ్యిందన్నారు. ఎస్ఎంసీ నిధులపై ప్రత్యేక ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. వీరికి నిర్దేశించిన బాధ్యతలు ఉపాధ్యాయులపై పడకుండా చూడాలన్నారు. కనీస విద్యార్హత ఉండేలా ఎస్ఎంసీ ఎన్నిక చట్టాల్లో మార్పు తేవాలని కోరారు.

ఘనంగా బహుళ ఏకాదశి పూజలు

ఉయ్యాలవాడ: కార్తీక మాసం బహుళ ఏకాదశి పురస్కరించుకుని మంగళవారం మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామంలో చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, కుంకుమ, సింధూర అర్చనలు, ఆకుపూజ చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి

చాగలమర్రి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో వంట ఏజెన్సీలు మెనూ కచ్చితంగా పాటించాలని, నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని ఎంఈఓ-2 సయ్యద్ న్యామతుల్లా సూచించారు. ఆయన మంగళవారం చాగలమర్రి మెయిన్ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం రుచి, నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు శేషాద్రి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పేరూరులో ఆధార్ శిబిరం

రుద్రవరం: మండల పరిధిలోని పేరూరు గ్రామ సచివాలయంలో మంగళవారం ఆధార్ శిబిరం ఏర్పాటు చేశారు. ఆ క్యాంప్లో మొత్తం 28 సర్వీసులు చేసినట్లు డిజిటల్ అసిస్టెంట్ బాష తెలిపారు. బుధవారం కూడా ఆధార్ క్యాంప్ కొనసాగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రీసర్వే అర్జీలను సత్వరం పరిష్కరించండి

ఉయ్యాలవాడ: గత నెలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం వహించకుండా సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం వీఆర్ఓలు, గ్రామ సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొలతల్లో వ్యత్యాసం, సర్వే నంబర్లలో తేడాలను సరిచేసి, రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల మంజూరు, ఆన్లైన్లో నమోదు చేయాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్బాబు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

నంద్యాల(అర్బన్): విజయనగరం ఎడ్యుకేషన్ సొసైటీ వారిచే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సుకుమాంబ కుమారిని మంగళవారం పట్టణంలోని విశ్వనగర్ కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు సీడ్స్ మద్దిలేటి మాట్లాడుతూ.. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా ఎందరో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన సుకుమాంబ కుమారి సేవలు మరువలేనివన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అభినందన

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల ఆర్టీసీ డిపోలో అక్టోబర్ మాసంలో ఉత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులకు మంగళవారం డిపో ఆవరణలో అభినందన సభ ఏర్పాటుచేశారు. డిపో మేనేజర్ గంగాధర్ రావు ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఉత్తమ డ్రైవర్లుగా ఎంజే బాషా, మాచర్ల, కాశీం డీఎస్ రావు, ఉత్తమ కండక్టర్లుగా శంకర్, హనీఫ్ వెంకటేశ్వర్లు, శేషన్న ఉత్తమ డ్రైవింగ్ ఇన్స్పెక్టర్గా పీఆర్టీ రెడ్డి, ఉత్తమ డిస్పాచ్ మెకానిక్గా హుస్సేన్ సాహెబ్ అభినందనలు పొందారు.

జాబ్మేళాలో 66 మందికి ఉద్యోగాలు

ఆళ్లగడ్డ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ పట్టణంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 66 మంది అభ్యర్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికై నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్రెడ్డి తెలిపారు. మొత్తం 168 మంది జాబ్మేళాకు హాజరు కాగా అందులో 66 మందిని ఆయా కంపెనీలు ఎంపిక చేసుకున్నట్లు చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఎమ్మెల్యే అఖిలప్రియ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

జియోట్యాగింగ్ వేగవంతం చేయాలి

ఉయ్యాలవాడ: గ్రామాల్లో నిర్వహిస్తున్న గృహాలకు సంబంధించిన జియో కోఆర్డినేట్ సర్వే వేగవంతం చేయాలని నంద్యాల డివిజన్ అభివృద్ధి అధికారి శివారెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు అంకితభావంతో పనిచేస్తూ బయోమెట్రిక్, ముఖచిత్ర హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఇతర గ్రామాలకు వెళ్లినప్పుడు మూమెంట్ రిజిస్టర్లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ఆన్లైన్ అనుసంధానం కాకపోవడంతో ప్రభుత్వ పథకాల సాయం జమ కావడం లేదన్నారు. ప్రతిఒక్కరూ బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ చేయించుకునేలా, అలాగే పోస్టాఫీసులో ఎన్పీసీఐ ఖాతాలు ప్రారంభించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్డీఓ శివారెడ్డి

రుద్రవరం: ప్రభుత్వం అప్పగించిన సర్వే పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని డీఎల్డీఓ శివారెడ్డి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. ఆయన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. హౌస్ హోల్డ్ సర్వే, యన్పీసీఐ అనుసంధానం త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీఓ భాగ్యలక్ష్మి ఉన్నారు.